
అలసిపోతున్న గుండె



- పెరుగుతున్న గుండెపోటు మరణాలు
- ఉన్నఫలంగా కుప్పకూలుతున్న యువత
- ఒత్తిడి జీవితంతో మరింత కుంగుబాటు
- పెద్దాసుపత్రికి పెరిగిన రోగులు
- నేడు వరల్డ్ హార్ట్ డే

కర్నూలు(హాస్పిటల్):

- కోసిగి మండలంలోని సాతనూరుకు చెందిన సమాజ సేవకుడు ఖాజా బందేనవాజ్ (38) గత నెల 30వ తేదీన గుండెపోటుకు గురై మృతి చెందాడు.
- కర్నూలుకు చెందిన ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ ఇటీవల ఉదయం పూజ చేస్తుండగా గుండెపోటుకు గురై కూర్చున్న చోటే కన్నుమూశారు.
- కర్నూలు, కృష్ణానగర్‌కు చెందిన ఓ వ్యక్తి ఆరు నెలల క్రితం ఇంట్లోనే గుండెపోటుతో కన్నుమూశారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో నాలుగు రోజుల తర్వాత దుర్వాసన వస్తుండటంతో స్థానికులు కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు.

ప్రజల ప్రాణాలు ఉన్నఫలంగా తీస్తున్న 10 ముఖ్యమైన కారణాల్లో గుండె సంబంధిత రుగ్మతలే అధికంగా ఉన్నాయని కేంద్ర జనగణన విభాగానికి చెందిన శాంపుల్ రిజిస్ట్రేషన్ సర్వే ఇటీవల పేర్కొంది. దేశంలోని మరణాల్లో దాదాపు మూడో వంతు వాటివల్లే సంభవిస్తున్నాయని తాజా నివేదిక పేర్కొంది. దీన్ని బట్టి ప్రస్తుతం మనిషి గుండె పరిస్థితి చెప్పొచ్చు. ఇటీవల జిల్లాలో వృద్ధులతో పాటు యువకులూ ఉన్నఫలంగా మృతి చెందుతుండటం ఆందోళనకు గురి చేస్తోంది. తీవ్రమైన మానసిక ఒత్తిడి, దీర్ఘకాలిక జబ్బులు, కరోనా తర్వాతి పరిమాణాలు గుండెను చిన్నాభిన్నం చేస్తున్నాయి. ఈ నెల 29వ తేదీన వరల్డ్ హార్ట్ డే సందర్భంగా ప్రత్యేక కథనం.

రాయలసీమకు పెద్దదిక్కైన కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని కార్డియాలజీ విభాగంలో గత ఆరేళ్లుగా గుండెజబ్బుల కేసులు బాగా పెరిగాయి. 2019 నుంచి ఇప్పటివరకు 91,000ల దాకా ఓపీ సేవలు అందుకోగా, 18 వేలకు పైగా ఆసుపత్రిలో చేరి చికిత్స అందుకున్నారు. గతేడాది నుంచి ప్రతి నెలా 150 నుంచి 180 మందికి యాంజియోగ్రామ్ చేస్తుండగా వారిలో 30 నుంచి 40 మందికి స్టెంట్లు వేస్తున్నారు. ఇందులో 25 నుంచి 40 ఏళ్ల మధ్య వయసు వారు 1235 మంది ఉండగా వారిలో 433 మందికి స్టెంట్లు వేయాల్సి వచ్చింది. గుండెపోటు వచ్చిన వెంటనే చాలా మంది ఆసుపత్రికి రాకుండా గ్యాస్ట్రబుల్ మాత్రలు వేసుకుని ఆలస్యం చేస్తున్నారు. తీరా పరిస్థితి విషమించాక ఆసుపత్రికి వస్తుండగా అప్పటికే కన్నుమూస్తున్నారు. సకాలంలో ఆసుపత్రిలోని క్యాజువాలిటీకి తీసుకొస్తే టెనెక్టిప్లేజ్ అనే ఖరీదైన ఇంజెక్షన్ వేయడం వల్ల వారు బతికే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. రూ.40 వేలు విలువజేసే ఈ చికిత్సా విధానాన్ని 2023లో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకొచ్చింది. జీజీహెచ్‌తో పాటు సీహెచ్‌సీలు, ఏరియా ఆసుపత్రుల్లోనూ ఈ ఇంజెక్షన్‌ను ఉచితంగా రోగులకు అందిస్తున్నారు. చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు గుండె సమస్యలకు ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా అందించేలా 20 ఏళ్ల క్రితం ఆనాటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి శ్రీకారం చుట్టగా ఏ ప్రభుత్వం వచ్చినా దీనిని నిరంతరంగా కొనసాగిస్తున్నారు.

గుండెపోటు లక్షణాలు

కొద్దిదూరం నడవగానే ఆయాసం, ఛాతిలో పట్టేసినట్లుగా ఉండటం, చెమట ఎక్కువగా పడుతుండటం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఉంటే గుండెపోటుగా అనుమానించాల్సి ఉంటుంది. ఈ మేరకు సమీప ఆసుపత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకుని, అవసరమైన చికిత్స తీసుకోవాలి.



కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని గుండెజబ్బుల విభాగం

గుండెపోటుకు కారణాలు

ధూమపానం, అధికంగా కొవ్వు పదార్థాలు తినడం, పరగడుపున రక్తంలో గ్లూకోజ్ ఎక్కువగా ఉండటం, అధిక కొలెస్ట్రాల్, రక్తపోటు, శారీరక వ్యాయామం లేకపోవడం, వంశపారంపర్యం, లిపోప్రోటీన్-ఎ, హైపర్ హోమోసిస్టెమియా, హైపర్ కాగ్యులబుల్ పరిస్థితి, కొకైన్ వాడకం లాంటివి ఉంటే గుండెపోటు వచ్చే అవకాశం ఉంది. ధూమపానం ఉంటే 72 శాతం, అధిక కొలెస్ట్రాల్ ఉంటే 52 శాతం, కుటుంబంలో ఎవ్వరికైనా హార్ట్ ఎటాక్ చరిత్ర ఉంటే 35 శాతం గుండెపోటు వచ్చే అవకాశం యువతలో ఎక్కువగా ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు.

ఇలా చేస్తే గుండె జబ్బులు దూరం

- మద్యపానం, పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలి.
- రోజూ వాకింగ్, యోగా, ధ్యానం చేయాలి
- సమతుల ఆహారం వల్ల గుండెకు బలం చేకూరుతుంది.
- బీపీ, షుగర్‌ను నియంత్రణలో ఉంచుకోవాలి. స్థూలకాయం తగ్గించుకోవాలి.
- వయస్సుకు తగినట్లు నిద్రపోవాలి.

అవగాహన కలిగిఉండాలి



జీవన శైలిలో మార్పులు, మానసిక ఒత్తిడి, ఎక్కువ సేపు కూర్చుని పనిచేయడం, ఆహారపు అలవాట్ల కారణంగా గుండె జబ్బులు పెరుగుతున్నాయి. ఈ మేరకు ప్రతి ఒక్కరూ గుండెజబ్బుల పట్ల అవగాహన పెంచుకోవాలి. బీపీ, షుగర్ ఉన్న వారు నియంత్రణలో ఉంచుకోవాలి. ధూమ, మద్యపానానికి దూరంగా ఉండాలి. దీర్ఘకాలిక వ్యాధులు ఉంటే వైద్యుల సూచన మేరకు మందులు వాడాలి.

– డాక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, కార్డియాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్, జీజీహెచ్, కర్నూలు

పెరిగిన గుండెపోటు కేసులు



గతంలో వృద్ధుల్లో మాత్రమే కనిపించే గుండెపోటు ఇప్పుడు యువతలోనూ పెరుగుతోంది. జీవనశైలి, తగిన ఆహారం లేకపోవడం, ఒత్తిడి వంటి అంశాలు గుండె సమస్యలకు దారి తీస్తున్నాయి. ప్రతిరోజూ కనీసం 30 నిమిషాలు వ్యాయామం చేయడం వల్ల గుండె బలంగా ఉంటుంది. ఇది ఊబకాయం, కొలెస్ట్రాల్, రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది. దీంతో పాటు సమతుల ఆహారం, ఒత్తిడి నియంత్రణ, తగినంత నిద్ర గుండెకు మేలు చేస్తాయి.

– డాక్టర్ ఎస్.చైతన్యకుమార్, కార్డియాలజిస్టు, కర్నూలు

ఉపాధి నిధులతో పచ్చదనం పెంపు

కర్నూలు(అగ్రికల్చర్): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో పచ్చదనం అభివృద్ధి లక్ష్యంగా ప్రతి మండలంలో అవెన్యూ ప్లాంటేషన్‌కు చర్యలు చేపట్టినట్లు జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటరమణయ్య తెలిపారు. రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించేందుకు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, విద్యా సంస్థలు, ప్రభుత్వ బంజరు భూములు, కొండల్లోని ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. డ్వామా నర్సరీలు, అటవీ శాఖ నర్సరీల్లో 5 లక్షల మొక్కలు సిద్ధంగా ఉన్నాయని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నందున మొక్కలు నాటే కార్యక్రమాన్ని వేగవంతం చేసినట్లు పేర్కొన్నారు. రైతులు తమ పొలాల్లో 100 శాతం సబ్సిడీతో పండ్ల తోటలు నాటుకోవడంతో పాటు చేల గట్ల వెంట కూడ మొక్కలు నాటుకునే విధంగా ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొన్నారు. మొక్కలు నాటే కార్యక్రమంలో గ్రామ పంచాయతీలు, స్వచ్ఛంద సంస్థలు, అన్ని వర్గాల ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 400 ఎకరాలతో పాటు రైతుల పొలాల్లో మొక్కలు నాటడాన్ని పూర్తి చేసినట్లు వివరించారు. వారం రోజుల లక్ష్యం మేరకు మొక్కలు నాటడాన్ని పూర్తి చేయనున్నట్లు తెలిపారు.

న్యాయవాదుల ప్రయోజనాలు పెంపు

కర్నూలు(సెంట్రల్): న్యాయవాదులకు అందించే సంక్షేమ ఫలాలను అక్టోబర్ 1వ తేదీ నుంచి పెంచుతున్నట్లు రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు రవిగువేరా తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ఇటీవల ఏపీ బార్ కౌన్సిల్ తీర్మానం మేరకు గతంలో న్యాయవాది మరణిస్తే ఇచ్చే రూ.6 లక్షల ప్రయోజనాన్ని రూ.9 లక్షలకు పెంచినట్లు చెప్పారు. అలాగే వైద్య సాయాన్ని రూ.1.5 లక్షల నుంచి రూ.2.5 లక్షలకు పెంచినట్లు చెప్పారు. మ్యాచింగ్ గ్రాంట్ రూ.4 లక్షలు, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5 లక్షలు ఇస్తారని వెల్లడించారు.

క్లుప్తంగా

రక్తదాన శిబిరం

కర్నూలు సిటీ: భగత్‌సింగ్ జయంతి సందర్భంగా విజ్ఞాన సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం జి.పుల్లయ్య ఇంజినీరింగ్ కాలేజీలో రక్తదాన శిబిరం నిర్వహించారు. రవీంద్ర విద్యాసంస్థల వ్యవస్థాపకుడు జి.పుల్లయ్య అధ్యక్షత వహించిన ఈ శిబిరానికి ముఖ్య వక్తగా తెలుగు అధ్యాపకులు డాక్టర్ చంద్రమౌళిని హాజరై ప్రసంగించారు. శిబిరంలో 52 మంది రక్తదానం చేశారు. కాలేజీ డీన్ శశికుమార్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ శంకర్‌ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు. అలాగే నందనపల్లె గ్రామ పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులను పంపిణీ చేశారు. సర్పంచ్ మాధురి, విజ్ఞాన సేవా సమితి అధ్యక్షుడు రామిరెడ్డి, ఉపాధ్యక్షులు డీవీ రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్, ఇంజినీర్‌పై చర్యలకు డిమాండ్



దెబ్బతిన్న రహదారిని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నగరంలో నాసిరకం రోడ్లు వేసిన మునిసిపల్ కాంట్రాక్టర్, పర్యవేక్షక ఇంజినీర్‌పై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ డిమాండ్ చేశారు. స్థానిక నెహ్రూ రోడ్డులో నాలుగు నెలల క్రితమే వేసిన సీసీ రోడ్డు చిన్న పాటి వర్షాలకే ఛిద్రమైందని, ఇందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆదివారం సీపీఎం బృందం, నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్ అధ్యక్షతన పాడైన రహదారిని పరిశీలించారు. అలాగే ఓల్డ్‌సిటీలో పెద్ద తిన్న పైపులైన్ పనులను పూర్తి చేసి మంచినీటి వసతిని కల్పించాలని డిమాండ్ చేశారు. జూలై 23వ తేదీ నుంచి మరమ్మతులు జరుగుతుండడంతో కొన్ని ప్రాంతాలకు ఇప్పటికీ నీళ్లు రావ డం లేదన్నారు. నాయకులు రవిశంకర్, కాజా బాషా, అబ్దుల్లా, బజారి తదితరులు పాల్గొన్నారు.

1వ తేదీ వరకే తగ్గింపు ధర

కర్నూలు(అగ్రికల్చర్): విజయదశమి సందర్భంగా హ్యాండీ క్రాఫ్ట్ వస్తువులపై 15 శాతం, చేనేత వస్త్రాలపై 10 శాతం తగ్గింపు ధర సెప్టెంబరు 1వ తేదీ వరకు మాత్రమే ఉంటుందని లేపాక్షి హ్యాండీక్రాఫ్ట్ ఎంపోరియం మేనేజర్ తిమ్మయ్య తెలిపారు. కొండారెడ్డిబురుజు సమీపంలోని లేపాక్షి ఎంపోరియంలో చేనేత వస్త్రాలతో పాటు హ్యాండీ క్రాఫ్ట్ వస్తువులు తగ్గింపు ధరపై అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు.

మార్కెట్ యార్డు గెస్ట్‌హౌస్‌లో చోరీ

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులోని గెస్ట్‌హౌస్‌లో చోరీ జరిగినట్లు తెలుస్తోంది. మూడు రోజుల క్రితం చోరీ జరిగితే బయటికి పొక్కకపోవడం గమనార్హం. యార్డులోని ఏడీఎం కార్యాలయం సమీపంలో గెస్ట్ హౌస్ ఉంది. మార్కెట్‌కు అన్ని వైపులా గేట్ల దగ్గర సెక్యూరిటీ సిబ్బంది ఉంటారు. వారి కన్నుగప్పి గెస్ట్‌హౌస్‌లో చోరీకి పాల్పడడం గమనార్హం. దొంగలు పట్టపగలే ఫ్యాన్‌లు, ఇతర వస్తువులను ఎత్తుకెళ్లినట్లు సమాచారం. గెస్ట్‌హౌస్ వెనుకభాగంలో గోడ దూకి దుండగులు లోనికి ప్రవేశించినట్లు భావిస్తున్నారు. మద్యం తాగిన ఆనవాళ్లు కూడా ఉన్నాయి. ఈ దొంగతనాన్ని మార్కెట్ కమిటీ అధికారులు సీరియస్‌గా తీసుకున్నట్లుగా కనిపించడం లేదు.

జయప్రదం చేయండి

కర్నూలు(సెంట్రల్): విశాఖపట్నంలో డిసెంబర్ 31 నుంచి జనవరి 4వ తేదీ వరకు జరిగే సీఐటీయూ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు డి.గౌస్‌దేశాయ్ పిలుపునిచ్చారు. ఆదివారం కార్మిక, కర్షక భవన్‌లో రైస్ మిల్ హమాలీ యూనియన్ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మహాసభలకు దేశంలోని అన్ని రంగాల కార్మిక వర్గ నాయకులు రాబోతున్న నేపథ్యంలో పెద్ద ఎత్తున ర్యాలీ ఉంటుందన్నారు. ర్యాలీకి జిల్లాలోని అసంఘటిత రంగ కార్మికులు హాజరుకావాలని పిలుపునిచ్చారు. నాయకులు ఆర్.నరసింహులు, సాయిబాబా పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయండి



సుందరీకరణ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ పి.విశ్వనాథ్

కర్నూలు (టౌన్): నగర ప్రధాన రహదారుల్లో చేపడుతున్న సుందరీకరణ పనులు వేగవంతం చేయాలని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ సూచించారు. ఆయన ఆదివారం స్థానిక బుధవారపేట, కలెక్టరేట్, గాయత్రీ ఎస్టేట్ ప్రాంతాల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. నాణ్యతలో ఎలాంటి రాజీ పడరాదని స్పష్టం చేశారు. నగరాన్ని ఆధునిక హంగులతో తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు తక్షణమే చేపట్టాలన్నారు. డీఈఈ గిరిరాజ్, పట్టణ ప్రణాళికాధికారి అంజాద్ బాషా పాల్గొన్నారు.

సగరలు అన్ని రంగాల్లో రాణించాలి

కర్నూలు(అర్బన్): సగరలు (ఉప్పర్లు) విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో రాణించాలని ఆంధ్రప్రదేశ్ సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాడిశెట్టి గోపి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక బీసీ భవన్‌లో సగర సంఘం జిల్లా ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సగరలను డీఎన్‌టీలో చేర్చి ఎస్టీలోకి మార్చాలన్నారు. వివిధ అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలన్నారు. సగర కుల గణన చేపట్టి, జనాభా నిష్పత్తి మేరకు విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రంగాల్లో రిజర్వేషన్లు కల్పించాలన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పర సురేష్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ సగర ఫైనాన్స్ కార్పొరేషన్‌కు రూ.1000 కోట్లు బడ్జెట్ కేటాయించాలని, బ్యాంకులతో ప్రమేయం లేకుండా రుణాలు మంజూరు చేయాలని కోరారు. రాష్ట్ర గౌరవాధ్యక్షులు తాడిశెట్టి నాగేశ్వరరావు, ఎల్‌వీ ప్రసాద్, రామగిడ్డయ్య, రాజేష్, పెద్ద మద్దిలేటి, రామాంజనేయులు, రాంప్రసాద్, భీమరాజు, శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర సగర సంఘం జిల్లా కన్వీనర్‌గా కొంగనపాడు ఉప్పర శివన్నను ఎన్నుకున్నారు.



ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న సగర సంఘం నేతలు

వీరశైవుల సమస్యల పరిష్కారానికి కృషి



తుల్జాపూర్ స్వప్నను సన్మానిస్తున్న వీరశైవ లింగాయత్ నేతలు

కర్నూలు(అర్బన్): వీరశైవ లింగాయత్‌ల ప్రధాన సమస్య అయిన ఓబీసీని పరిష్కరించేందుకు కృషి చేయనున్నట్లు ఆ కార్పొరేషన్ చైర్‌పర్సన్ తుల్జాపూర్ స్వప్న చెప్పారు. వీరశైవులను ఓబీసీలుగా గుర్తించేందుకు ఎలాంటి ఆర్థికభారం పడదని, ఈ అంశాన్ని రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి దృష్టికి తీసుకెళతామన్నారు. ఆదివారం నగరంలోని వీరశైవ ఐక్యవేదిక కార్యాలయంలో జరిగిన సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వప్న మాట్లాడుతూ.. అమరావతితో పాటు కర్నూలులో బసవ భవన్‌లను నిర్మించేందుకు కృషి చేస్తామన్నారు. వీరశైవులు ఐకమత్యంగా అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలన్నారు. వీరశైవ సంఘాల ఆధ్వర్యంలో చైర్‌పర్సన్ స్వప్నను ఘనంగా సన్మానించి వినతి పత్రాలను అందించారు. ఆయా సంఘాల నాయకులు తుల్జాపూర్ ఉమా మహేశ్వర్, ఎస్‌వీ శివరాజు, ఏజీ మల్లికార్జునప్ప, జీ చంద్రశేఖరప్ప, శెట్టి వీరశేఖరప్ప తదితరులు పాల్గొన్నారు.

జీవనశైలి మార్పులతో గుండెపోటు

కర్నూలు(హాస్పిటల్): జీవనశైలి మార్పులతోనే గుండెపోటు మరణాలు పెరుగుతున్నాయని సీనియర్ కార్డియాలజిస్టు డాక్టర్ ప్రతాప్ చంద్రరాత్ చెప్పారు. కర్నూలు హార్ట్ ఫౌండేషన్, కార్డియాలజీ సొసైటీ ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఎ.క్యాంపులోని హెల్త్ క్లబ్‌లో వరల్డ్ హార్ట్ డే నిర్వహించారు. అతిథి డాక్టర్ ప్రతాప్ చంద్రరాత్‌కు అవుట్ స్టాండింగ్ పర్సన్ ఆఫ్ ది ఇయర్ అవార్డును అతిథులు ప్రదానం చేశారు. అనంతరం ఆయన యువతలో గుండెపోటు గురించి మాట్లాడారు. వంశపారంపర్యం, ఎక్కువ సేపు కూర్చొనే ఉద్యోగాలు, నిద్రవేళలు, ఆహారపు అలవాట్లు, మానసిక ఒత్తిడి గుండెపోటు కారణాలుగా పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ ఏడాదికోసారి వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఎంపి బస్తిపాటి నాగరాజు, రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్, కర్నూలు హార్ట్ ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ పి.చంద్రశేఖర్ మాట్లాడు తూ.. గుండె జబ్బుల నివారణకు పలు సూచనలు చేశారు. ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు డాక్టర్ భవానీప్రసాద్, కల్కూర చంద్రశేఖర్, సభ్యులు కేవీ సుబ్బా రెడ్డి, డాక్టర్ గెలివి సహదేవుడు తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ ప్రతాప్ చంద్రరాత్‌ను సన్మానిస్తున్న డాక్టర్ చంద్రశేఖర్, ఎంపీ తదితరులు

భక్తిశ్రద్ధలతో చండీహోమం

కల్లూరు: కల్లూరు అర్బన్ 36వ వార్డు పరిధిలోని హరిహర దేవాలయంలో దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా ఆదివారం చండీహోమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. హరిహర దేవాలయం కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



చండీహోమంలో పాల్గొన్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

ఉద్యోగులపై ప్రభుత్వం చిన్నచూపు

కర్నూలు సిటీ: ఎన్నికల సమయంలో ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని పీఆర్‌టీయూ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వి.కరుణానిధిమూర్తి అన్నారు. ఆదివారం బిర్లా కాంపౌండ్‌లోని ఆ సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజా ప్రతినిధులు తమ జీతభత్యాలు, పెన్షన్లు, వైద్య సౌకర్యాలపై ఆగమేఘాల మీదు అసెంబ్లీలో బిల్లులు పాస్ చేసుకొని, మెరుగైన సౌకర్యాలు పొందుతున్నారన్నారు. అయితే ఉద్యోగ, ఉపాధ్యాయులకు సౌకర్యాలు కల్పించడం పట్ల తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. నాలుగు పెండింగ్ డీఏలు, పాత డీఏల బకాయిలు చెల్లించాలన్నారు. పీఆర్‌సీ ఆలస్యం అయినందున 30 శాతం మధ్యంతర భృతిని తక్షణమే ప్రకటించాలన్నారు. లేకుంటే అతి త్వరలో పీఆర్‌టీయూ ఉద్యమ కార్యాచరణకు శ్రీకారం చూడుతుందన్నారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఎన్.వి కృష్ణారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ రవి ప్రకాష్, అసోసియేట్ ప్రెసిడెంట్ రమణయ్య, రాష్ట్ర కౌన్సిలర్ బాబురావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీఆర్‌టీయూ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వి.కరుణానిధిమూర్తి

అన్నను తిడితే తమ్ముడు పవన్ స్పందించరేం?

- నారా వారి చేతుల్లోకి నందమూరి ఫ్యామిలీ
- విలేకరుల సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి

కర్నూలు (టౌన్): స్వయాన అన్న, సౌమ్యుడు అయిన చిరంజీవిపై అసెంబ్లీలో అభ్యంతరకరంగా హిందూపురం ఎమ్మెల్యే బాలక్రిష్ణ మాట్లాడితే తమ్ముడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పందించరేం అని వైఎస్సార్‌సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి ప్రశ్నించారు. ఒక వైపు చిరంజీవి అభిమానులు ఆందోళనలు, ధర్నాలు చేస్తున్నా.. పవన్ కళ్యాణ్‌కు చలనం లేదన్నారు. ఆదివారం కర్నూలులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మెగా ఫ్యామిలీ మీద ఈగ వాలనీయను అని పదే పదే చెప్పిన పవన్ కళ్యాణ్ కూటమితో జత కట్టి పదవి దక్కిన తరువాత సొంత వాళ్లను విమర్శలు చేస్తున్నా సంబంధం లేనట్లుగా వ్యవహరించడం అభిమానులు జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. నారా వారి చేతుల్లోకి నందమూరి ఫ్యామిలీ వెళ్లిపోయిందన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడి ఆదేశాల మేరకు బాలక్రిష్ణ అసెంబ్లీలో మాజీ సీఎం జగన్‌తో పాటు చిరంజీవిని టార్గెట్ చేశారన్నారు. చంద్రబాబు ఎలా ఆడమంటే అలా బాలక్రిష్ణ నాటకాలు ఆడుతున్నారన్నారు. జగన్‌ను విమర్శించే హక్కు లేదన్నారు

చంద్రబాబు పార్టీకి షర్మిల బినామీ: లక్కీ 2 సోదరులు

కాంగ్రెస్‌పార్టీ నుంచి కర్నూలు పార్లమెంటుకు పోటీ చేసినప్పుడు ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల టీడీపీకి అనుకూలంగా పనిచేయాలని చెప్పడం ఆశ్చర్యమేసిందని లక్కీ 2 సోదరులు రాంపుల్లయ్య యాదవ్, నరసింహులు యాదవ్‌లు అన్నారు. పదుల సంఖ్యలో ఆమె ప్రెస్ మీట్లు పెట్టిన సమయంలో ప్రతిపక్షంలో ఉన్న జగన్ మాత్రమే విమర్శిస్తారని, అధికారంలో ఉన్న చంద్రబాబు గురించి ఎందుకు మాట్లాడటం లేదన్నారు. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు షర్మిల టీడీపీకి బినామీగా వ్యవహరిస్తున్నారన్నారు. బాలక్రిష్ణ అసెంబ్లీలో చిరంజీవిని గౌరవం లేకుండా మాట్లాడటం, అసెంబ్లీలో ఉన్న పవన్ కళ్యాణ్ ఖండించకపోవడం మరింత బాధకరమన్నారు.

నేడు పీజీఆర్ఎస్

కర్నూలు (టౌన్): సుంకేసుల రోడ్డులోని నగరపాలక సంస్థ నూతన కౌన్సిల్ హాలులో సోమవారం ఉదయం 10.30 గంటలకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర పరిధిలోని ప్రజలకు తమ కాలనీల్లో ఏవైనా సమస్యలు ఉంటే లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చన్నారు.

అన్నదానం

కర్నూలు (టౌన్): స్థానిక చల్లా వారి వీధిలో దుర్గామాత మండపం వద్ద కర్నూలు ప్రగతి వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీహర్ష ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దుర్గమాత ఆశీస్సులు అందరిపై ఉండాలన్నారు. స్థానికులు హరినాథ్ గౌడ్, శ్రీనివాసులు, నరేష్‌రావు, లోకేష్, ప్రసన్న, రవి తదితరులు పాల్గొన్నారు.

జయహో జగజ్జనని



లలితా పీఠంలో..



వారాహిగా..



వెంకాయపల్లె ఎల్లమ్మ



చండీ దేవిగా..

దేవనగర్ - పాత కల్లూరు రాకపోకలు బంద్

కర్నూలు (టౌన్): నగరంలోని దేవనగర్ నుంచి పాత కల్లూరుకు వెళ్లే రహదారిలో రాకపోకలకు బ్రేక్ పడింది. వర్షాలు దంచి కొట్టడంతో పాటు గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయడంతో హంద్రీకి భారీగా నీరు చేరింది. దీంతో పాత కల్లూరులోని కాజ్ వే బ్రిడ్జిపై వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రెండు రోజులుగా ఈ ప్రాంతంలో వాహనాలు, ఆటోల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. పాత కల్లూరుకు వెళ్లేందుకు ఐటీసీ మీదుగా, లేకుంటే కొత్తబస్టాండ్ మీదుగా వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. కాజ్ వే బ్రిడ్జి తక్కువ ఎత్తులో ఉండటంతో భారీ వర్షాలు పడిన ప్రతిసారి ఈ సమస్య వస్తోంది. బ్రిడ్జి ఎత్తు పెంచాలని కోరినా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.



పాత కల్లూరు కాజ్ వే బ్రిడ్జిపై పారుతున్న వరద నీరు

సాహిత్య దిగ్గజం జాషువా

కర్నూలు(సెంట్రల్): తెలుగుజాతి సాహిత్య దిగ్గజం గుర్రం జాషువా అని మాజీ ఎమ్మెల్సీ ఏఐసీసీ సభ్యుడు సుధాకరబాబు అన్నారు. ఆదివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గుర్రం జాషువా, భగత్‌సింగ్ జయంతి కార్యక్రమాలు నిర్వహించారు. వారి చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు బజారన్న, షేక్ ఖాజా హుస్సేన్, ఎన్.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపరిహారం ఇవ్వాలి

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో అధిక వర్షాలకు పత్తి, టమాట, ఉల్లి పంటలు దెబ్బతినడంతో నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.50 వేలు ఇచ్చి ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం కార్మిక, కర్షక భవన్‌లో జరిగిన రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, రుణాలు మాఫీ చేయాలని, ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు కె.వెంకటేశ్వర్లు, జి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో జిల్లాకు పతకాలు



పతకాలు సాధించిన కర్నూలు అథ్లెట్లు

కర్నూలు (టౌన్): ఆచార్య నాగర్జున యూనివర్సిటీలో ఈనెల 27, 28 తేదీల్లో నిర్వహించిన 38వ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో కర్నూలు క్రీడాకారులు పతకాలు సాధించారు. అండర్-14 బాలుర విభాగం ట్రయాథ్లాన్‌లో రంగముని (తృతీయ స్థానం), అండర్-16 బాలికల విభాగం 600 మీటర్ల పరుగు పందెంలో లక్ష్మీ శాంతి (ప్రథమ స్థానం), మిడ్లే రిలేలో లక్ష్మీశాంతి, తన్విరెడ్డి, స్వాతి రెడ్డి, పల్లవి (ద్వితీయ స్థానం), అండర్-18 బాలుర విభాగం 1000 మీటర్ల పరుగులో నరసింహులు (ప్రథమ స్థానం), 5 వేల మీటర్ల రేస్ వాక్‌లో మల్లికార్జున (ద్వితీయ స్థానం), అండర్- 20 విభాగం 100 మీటర్ల పరుగులో మంజునాథ్ (తృతీయ స్థానం), 400 మీటర్ల రిలేలో దీవెనకుమార్, పరుశరాముడు, మహేంద్ర, శేఖర్ నాయక్ (తృతీయ స్థానం)లో నిలిచారు. పతకాలు సాధించిన అథ్లెట్లను జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి సుబ్బరత్నాలు, కార్యదర్శి జాన్, టీమ్ మేనేజర్ లక్ష్మయ్య, కోచ్ కాశీరావు అభినందించారు.